క్లుప్తంగా

ఈపీ ఆపరేటర్స్ ఏరియా ఆర్గనైజర్‌గా తుంగ శ్రావణ్


శ్రావణ్‌కు కండువా కప్పుతున్న ఏరియా ఉపాధ్యక్షుడు రాజాబాబు

రెబ్బెన(ఆసిఫాబాద్): హెచ్‌ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఈపీ ఆపరేటర్స్ ఆర్గనైజర్‌గా ఖైరిగూడ ఓసీపీకి చెందిన తుంగ శ్రావణ్‌ను ఆదివారం నియమించినట్లు ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారంతోపాటు యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఏరియా ఆర్గనైజర్ ఎస్‌కే ఇనూస్, ఎస్‌అండ్‌పీసీ ఫిట్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఖైరిగూడ ఫిట్ కార్యదర్శి కంపెల్లి రమేశ్, ఆర్గనైజర్స్ సదానందం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం


స్నేహను సన్మానిస్తున్న సంఘం నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన దుర్గం స్నేహ అనే విద్యార్థిని హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఎంబీబీఎస్ సీటు సాధించినందుకు ఆదివారం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు సన్మానించారు. సంఘం అధ్యక్షుడు జయదేవ అబ్రహం, నాయకులు శివప్రసాద్, నర్సయ్య, షేక్ మహబూబ్, సుభాష్, నర్సింగరావు, నర్సయ్య, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు స్వీట్లు పంపిణీ


స్వీట్లు అందజేస్తున్న పురుషోత్తం

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు ఘనపురం సీతారం ఫౌండేషన్(జీఎస్‌ఎఫ్) వ్యవస్థాపకుడు జానకి పురుషోత్తంరావు ఆదివారం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. సర్పంచ్ ఘనపురం కావ్య, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం


సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్ శివాలయంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. శివరాత్రి పర్వదినం మరుసటి రోజు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన సోలంకి పూరారాం అన్నదానం చేశారు. గత ఐదేళ్లుగా ఆలయంలో ఆయన తరఫున అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శివాలయం కమిటీ పూరారాంను సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డిస్మిస్ చేసిన ఉద్యోగులను తీసుకోవాలి


మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

మందమర్రిరూరల్: సింగరేణిలోని భూపాలపల్లి ఏరియాలో గైర్హాజర్ పేరిట, విధుల్లో నిర్లక్ష్యం పేరిట యాజమాన్యం అక్రమంగా డిస్మిస్ చేసిన 47మంది ఉద్యోగులను వెంటనే భేషరతుగా ఉద్యోగంలోకి తిరిగి తీసుకోవాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పాలకవర్గం, యాజమాన్యం కార్మికవర్గంపై దాడి చేస్తున్నాయని, అందుకే ఉద్యోగులపై పాశవికంగా వ్యవహరిస్తూ ఉద్యోగం నుంచి తొలగించే కార్యక్రమం చేపట్టిందని ఆరోపించారు. యాజమాన్యం డిస్మిస్ చేసిన ఉద్యోగులను తిరిగి విధులకు తీసుకునేంత వరకు, కార్మిక సంఘాలను కలుపుకుని కార్మిక వర్గం సహకారంతో ఆందోళనలు చేస్తామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రాజిరెడ్డి, వెల్డి సుదర్శన్, మణి రాంసింగ్ ఠాకూర్, నారాయణ, జాఫర్, నీరటి రాజన్న, దేవి సత్యం తదితరులు ఉన్నారు.

ఇళ్లలోనే పత్తి నిల్వ..!

- ధర పెరుగుదల కోసం రైతుల ఎదురుచూపులు
- కూలీల ఖర్చులు, వడ్డీల కోసం తిప్పలు

రెబ్బెన: పంట దిగుబడి లేక పండిన పంటలకు ధర లేక పెట్టిన పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితిలో పత్తి రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ధర పెరిగే వరకు పత్తి పంటను ఇంట్లో ఉంచుకోలేక తక్కువ ధరకు పంట అమ్ముకోలేక మనోవేదనకు గురవుతున్నారు. పత్తి పంటను నెలల తరబడి ఇంట్లోనే నిల్వ చేసుకుని ధర పెరుగుదల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

మండలంలో 24,496 ఎకరాల్లో సాగు

మండలంలో సాగు చేసే పంటల్లో పత్తి పంటకే మొదటి స్థానం. వర్షాకాలంలో మండలంలో 24,496 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. వర్షాకాలం ప్రారంభం నుంచే కురిసిన భారీ వర్షాలతో చాలా గ్రామాల్లో పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. భారీ వర్షాల కారణంగా భూమిలో తేమశాతం ఎక్కువగా ఉండి పత్తిలో ఎదుగుదల లోపించి దాని ప్రభావం దిగుబడిపై చూపించింది. మండలంలో పత్తి దిగుబడి ఎకరానికి సగటు 5 నుంచి 6 క్వింటాళ్లు ఉండగా అధిక వర్షాల కారణంగా 3 నుంచి 4 క్వింటాళ్లకు మించలేదు. నీరు నిల్వని తేలిక భూముల్లో కొంత ఆశించిన స్థాయిలో దిగుబడి రాగా 90శాతం భూముల్లో దిగుబడి తగ్గిపోయింది. సీజన్ ప్రారంభంలో క్వింటాల్‌కు రూ.9100 పలికి రైతులను ఊరించగా ఆపై క్రమంగా తగ్గుతూ రైతులను ఆర్థికంగా కుంగదీసింది.


రాంపూర్‌లో ఇంటి ఎదుట నిల్వ చేసిన పత్తి

పెట్టుబడులు కూడ రాలేని దుస్థితి

గతేడాదితో పోల్చితే ఈసారి పత్తి పంటల సాగు గణనీయంగా పెరిగింది. పెరిగిన డీజిల్ ధరల ప్రభావం దుక్కి దున్నే ట్రాక్టర్ కిరాయిపై చూపగా పెరిగిన కూలీల ఖర్చులు, ఎరువుల ధరలు వెరసి పెట్టుబడులు పెరిగేందుకు కారణమయ్యాయి. పత్తి ధర రోజురోజుకు పతనమవుతూ ప్రస్తుతం రూ.8 వేలు పలుకుతోంది. గతేడాది సీజన్ చివర్లో క్వింటాల్‌కు రూ.10వేల వరకు చేరడంతో ఈసారి అలాగే పెరుగుతుందేమోనని ఆశతో పంటనంతా ఇంట్లోనే నిల్వ చేసి ధర పెరుగుదల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. సీజన్ ముగుస్తున్నా ధర పెరుగుదల లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇంట్లోనే పంట



నాకున్న 18 ఎకరాల భూమిలో పత్తి వేసిన. ఈ సంవత్సరం వర్షాలు బాగాపడి దిగుబడి సగానికి సగం పోయింది. 18 ఎకరాలకు మొత్తం 70 క్వింటాళ్ల పత్తి మాత్రమే వచ్చింది. ధర లేకపోవటంతో ధర పెరుగుతుందని తీసిన పత్తిని అంతా ఇంట్లోనే ఉంచుకున్నా. రెండున్నర నెలలు నుంచి ధర తగ్గుతూనే ఉంది కాని పెరగడం లేదు.
– పూదరి మల్లయ్య, రైతు

దిగుబడి తగ్గి.. ఖర్చు పెరిగింది



గతేడాదితో పోల్చితే ఈసారి పత్తిలో దిగుబడి తగ్గి ఖర్చులు బాగా పెరిగాయి. నా సొంత భూమి ఐదెకరాల్లో పత్తి సాగుచేస్తే ఈసారి రూ.1.5 లక్షల ఖర్చు వచ్చింది. పోయిన ఏడాది 28 క్వింటాళ్ల పత్తి దిగుబడి రాగా ఈసారి 18 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. వర్షాలతో ఈసారి మొత్తం మునిగినం.
– జుమ్మిడి వెంకటి, రైతు

రూ. 15వేల ధర చెల్లించాలి



పత్తి క్వింటాల్‌కు రూ.15వేల ధర చెల్లించాలి. అధిక వర్షాలతో పత్తి పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈసారి పెరిగిన ధరల కారణంగా పంటల పెట్టుబడులు భారీగా పెరిగాయి. మార్కెట్‌లో పెరిగిన ధరలకనుగుణంగా పత్తికి కూడా రూ.15 వేల ధర చెల్లించాలి. ప్రభుత్వమే పత్తిని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.
– బోగే ఉపేందర్, స్థానికుడు

అమ్మలాలన.. తండ్రి పాలన

- అనాథలకు అమ్మ ఒడి..కస్తూర్బా
- సత్ఫలితాలిస్తున్న పాఠశాల
- మెరుగైన విద్యాబోధన

కెరమెరి: కొందరు తల్లి..మరికొందరు తండ్రి, ఇంకొందరు తల్లిదండ్రులను కోల్పోయిన వారికి అమ్మ లాలన..తండ్రి పాలనను తలపిస్తోంది. మండలంలోని మోడి (కేజీబీవీ) కస్తూర్బాగాంధీ విద్యాలయం. గ్రామీణ ప్రాంతాల్లో బాలికల అక్షరాస్యత పెంపొందించాలనే సంకల్పంతో ప్రారంభించిన కేజీబీవీ పేద బాలికలకు అమ్మఒడిలా పనిచేస్తోంది. బడీడు పిల్లల్లో డ్రాపౌట్ శాతం తగ్గించాలని, బడిబయట పిల్లలు లేకుండా చేయాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన కేజీబీవీ సత్ఫాలితాలను ఇస్తోంది. అనాథలు, ఆర్థిక స్థోమత లేనివారు, చదువులు మధ్యలో మానేసిన బాలికలు ఈ ఆశ్రమంలో తల్లి ఆదరణను పొందుతున్నాయి.

246 బాలికలు..వసతులు భేష్

మండల కేంద్రంలో 2007లో ఈ పాఠశాల ప్రారంభమైంది. ప్రారంభంలో కేవలం 40 మంది విద్యార్థినులు ప్రవేశం పొందగా.. క్రమంగా వారిసంఖ్య పెరుగుతూ నేడు 246కి చేరింది. విశాల భవనం..ఆహ్లాద వాతావరణం.. సరిపడా గదులు..అనుభవజ్ఞులైన విద్యాబోధనకు ఉండడంతో మంచి వాతావరణంలో విద్యాబోధన చేస్తున్నారు. ప్రస్తుతం 6 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 191 మంది విద్యార్థినులు ఉండగా.. ఇంటర్‌లో 55 మంది విద్యార్థినులు ఉన్నారు. బాలికలకు విద్యతోపాటు స్వయం ఉపాధికి శిక్షణ అందిస్తున్నారు. ప్రధానంగా చదువు మధ్యలో మానేసిన వారికి, చదువుల్లో వెనుకబడిన బాలికలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. కాగా, తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరిని కోల్పోయిన బాలికలు 24 మంది ఉండగా..అనాథ ఒకరు ఉన్నారు.


తల్లిదండ్రులు కోల్పోయిన విద్యార్థినులు

రూ.30 వేలు సంపాదించా



మాది వాంకిడి మండలంలోని బెండార గ్రామం. నాన్న చిన్నప్పుడే మృతిచెందారు. అమ్మ ఉంది. నా తోబుట్టువులు నలుగురు వారంతా చిన్నవాళ్లు. 2019లో ఆన్‌లైన్ తరగతులు వింటున్నా. కూలీ పనులకు వెళ్లి రూ.30 వేలు సంపాదించా.
– మహల్లే శ్రీలత, ఫస్టియర్

చదువుపై ఆసక్తి



నాది వాంకిడి మండలం బంబారా గ్రామం. చిన్నప్పుడే నాన్న చనిపోయిన తర్వాత తల్లి మరో పెళ్లి చేసుకుంది. ప్రస్తుతం నాన్నమ్మ వద్ద ఉంటున్నా. చదువుపై ఎంతో ఆసక్తి ఉంది. అందుకు నన్ను ఇక్కడికి చేర్పించారు. తల్లిదండ్రులను మరిపించేలా బడి ఉంది.
– బామ్నె యోగిత, 9వ తరగతి

మెరుగైన వసతులు కల్పించాం



పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించాం. విద్యార్థినులకు నాణ్యమైన విద్య, భోజనాన్ని అందిస్తున్నాం. ప్రస్తుతం పాఠశాలలో 246 మంది బాలికలున్నారు. వారి చదువుకు కావల్సిన వాతావరణాన్ని కల్పిస్తున్నాం. సొంత పిల్లల్లా చూస్తున్నాం.
– మీనాకుమారి, ఎస్‌వో

శివయ్యా..చల్లంగా చూడు


భక్తులతో కిటకిటలాడుతున్న ఈజ్‌గాం ఆలయం


స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కాగజ్‌నగర్‌రూరల్: మహాశివరాత్రి పురస్కరించుకుని ఈజ్‌గాం శివమల్లన్న ఆలయంలో ఆదివారం జాతర కనుల పండువగా జరిగింది. మూడోరోజు భక్తజనంతో ఆలయం కిటకిటలాడింది. కాగజ్‌నగర్ పరిసర ప్రాంతాలతోపాటు ఆసిఫాబాద్ నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో బోనాలు పోసి మల్లన్న దేవునికి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. ఆలయకమిటీ చైర్మన్ ఇందారపు రాజేశ్వర్‌రావు, కార్యనిర్వహణాధికారి వేణుగోపాల్ గుప్తా ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, అన్నపూజ, అభిషేకాలు చేపట్టారు. కౌటాలకు చెందిన నూతన వధూవరులు కిరణ్‌కుమార్, అచల్‌లు ప్రేమవివాహం చేసుకోగా, శివమల్లన్న స్వామికి పాలాభిషేకం చేశారు. భక్తుల సౌకర్యార్థం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో మంచినీటిని సరఫరా చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో రూరల్ ఎస్సైలు సోనియా, జగదీశ్, దీకొండ రమేశ్‌లు బందోబస్తు నిర్వహించారు.

పెంచికల్‌పేట్‌లో..


పూజలు చేస్తున్న భక్తులు

పెంచికల్‌పేట్: మండలంలోని పంచకళపురి క్షేత్రంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా రెండోరోజు భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఉపవాస దీక్షలను విరమించారు. చివరిరోజు ఆలయంలో ప్రభల ఊరేగింపు ఘనంగా నిర్వహించేలా ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తిచేశారు.


సహపంక్తి భోజనాలు చేస్తున్న భక్తులు


ఆశీర్వచనం పొందుతున్న భక్తురాలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు


భక్తులకు అన్నదానం చేస్తున్న సభ్యులు


ఖర్జెల్లి శివాలయంలో..

బెజ్జూర్: మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక ఆలయ ప్రాంగణంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో చేరుకోవడంతో ఆదివారం రెండో రోజు సైతం సందడిగా మారింది. మండలంతోపాటు ఆయా మండలాల నుంచి సైతం భక్తులు చేరుకుని మొక్కులు చెల్లించుకోవడంతో శివాలయం, రంగనాయక స్వామి, అభయాంజనేయ స్వామి, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బెజ్జూర్ ఎస్సై వెంకటేశ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చిన భక్తులకు ఆయా కుల సంఘాల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం వేళ నిర్వహించిన డాన్స్ బేబీ డాన్స్ పలువురిని ఆకట్టుకుంది.

ఘనంగా బోనాలు

దహెగాం: మండలంలోని లగ్గాం గ్రామంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా శివరాత్రి మరుసటి రోజు గ్రామంలో బోనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. భాజభజంత్రీలతో గ్రామంలోని వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపుల శివసత్తుల ఆటలతో సందడి నెలకొంది.

శివుడికి పూజలు

చింతలమానెపల్లి: మండలంలో ఆదివారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మహాశివరాత్రి సందర్భంగా జాగరణ చేసిన భక్తులు ఉపవాసాన్ని విరమించి పూజలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు రోజు సందర్భంగా ఖర్జెల్లి , శివపెల్లి శివాలయాలు, హేటిగూడ గణపతి ఆలయాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. శివలింగాలకు పూజలు చేసిన భక్తులకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఖర్జెల్లి శివాలయం వద్ద శివరామ సాయి యూత్, మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్సవాలకు హాజరైన భక్తులకు పండ్లు పంపిణీ చేశారు.

శివాజీ అడుగుజాడల్లో నడవాలి


జైనూర్‌లో పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నాయకులు


చింతలమానెపల్లిలో శివాజీ జయంతి ర్యాలీ

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి
- ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

నార్నూర్(జైనూర్): ఛత్రపతి శివాజీ మహారాజ్ అడుగుజాడలో నడవాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కుమురం భీం జెడ్పీచైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. జైనూర్ మండల కేంద్రంలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడే ఉన్న కుమురం భీం, బీఆర్ అంబేద్కర్, రాణి దుర్గావతి విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివాజీ మహారాజ్ చేసిన పోరాటాలను గుర్తు చేశారు. శాంతి, అహింసతోనే ఏదైనా సాధ్యమవని అనాటి మహనీయులు చాటి చెప్పారని అన్నారు. జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ కనక యాదవ్‌రావు, ఎస్ఐ మధుకర్, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కొట్నాక్ విజయ్ ఉన్నారు.

దహెగాం: మండల కేంద్రంతోపాటు లగ్గాం, గిరవెల్లి తదితర గ్రామాల్లో ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాజీ విగ్రహానికి ఆరె సంఘం మండల అధ్యక్షుడు తుమ్మిడె నారాయణ పూలమాలలు వేసి జెండా ఎగురవేశారు. సర్పంచ్ పుష్పాల లక్ష్మి, ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మి, ఆరె సంఘం మండల ఉపాధ్యక్షుడు వెంకన్న ఉన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించారు. ఎల్లూర్‌లో వీధులగుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఆరె సంక్షేమ సంఘం నాయకుడు చప్పిడే సత్యనారాయణ, సర్పంచులు ఉపాసీ సంజీవ్, పాలె సుధాకర్, చౌదరి సుజాత శ్రీనివాస్, తిరుపతి, రాజేశ్వర్, గణపతి, వెంకన్న, అంజన్న, బండయ్య, మహేశ్, పొట్టి శ్రీనివాస్, అంజన్న పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించారు. ఆరె సంఘం ఆధ్వర్యంలో సిర్పూర్(టి) పంచాయతీ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండ్ చౌరస్తా వద్ద మండల అధ్యక్షుడు శంకర్ జెండా ఆవిష్కరించారు.

కెరమెరి: మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో ఛత్రపతి శివాజీ ప్రతిమకు యువకులు పూలమాలలు వేశారు. అనంతరం రాత్రి 9 గంటల వరకు శోభాయాత్రను నిర్వహించారు. యువకులు జెండాలతో డీజే పాటలపై నృత్యాలు చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి ఉన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: మండలవ్యాప్తంగా జరిగిన జయంతి వేడుకల్లో ఆరె సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు. మోతుగూడ సంఘం అధ్యక్షుడు రాజయ్య, ప్రభాకర్, వినోద్, పోచ్చయ్య, పాలక్‌రావు, నగేష్ ఆనంద్‌రావు, విశ్వనాథ్, బాలకిషన్, గోపాల్ పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని ఆరె సంఘం భవనంలో మండల అధ్యక్షుడు ధునుర్కార్ వసంత్‌రావ్. శివాజీ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో శివాజీ చిత్రపటాలకు నివాళ్లు అర్పించారు. గ్రామాల్లో ఆరె కులస్తులు బాజాభజంత్రీలతో ఊరేగింపు చేస్తూ ర్యాలీ తీశారు. సర్పంచులు వొజ్జల మానిష్, ఎకోన్‌కార్ దామోదర్, రాందాస్ పాల్గొన్నారు.

రెబ్బెన: మండల కేంద్రంలోని పాత పోలీస్ స్టేషన్ సమీపంలో ఆరె సంఘం ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. జెడ్పీటీసీ సంతోష్, ఎంపీపీ సౌందర్య, ఆరె సంఘం నాయకులు చిత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. సర్పంచ్ అహల్యాదేవి, ఎంపీటీసీ పెసరు మధునయ్య, ఆరె సంఘం మండల అధ్యక్షుడు చౌదరి సుభాష్, లక్ష్మీపూర్ సర్పంచ్ కోలే శ్యాంరావు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని శివాజీ చౌరస్తాలో భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేశారు. భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు శివాగౌడ్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు రంగస్వామి, మురళీ, విజయ్, శ్రావణ్, బీజేపీ నాయకులు వెంకటేశం, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు. అదే విధంగా అందవెల్లి, ఈజ్‌గాం, ఆరెగూడ గ్రామాల్లోని ఆయన విగ్రహాలకు పూలమాల వేశారు.

చింతలమానెపల్లి: చింతలమానెపల్లిలో ఆరెకుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. శివాజీ యువసేన ఆధ్వర్యంలో యువకులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో శివాజీ విగ్రహం వద్ద నాయకులు నివాళులర్పించారు. ఎంపీపీ నానయ్య, ఆరె కుల సంఘం జిల్లా నాయకులు వెంకన్న, సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించారు. ఎంపీపీ ముండె విమలబాయి, పీఏసీఎస్ చైర్మన్ జబోరె పెంటు పాల్గొన్నారు.


కౌటాలలో..


ఆసిఫాబాద్‌రూరల్: జెండా ఆవిష్కరిస్తూ..


సిర్పూర్(టి): జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


వాంకిడి: శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ విమలబాయి

'షర్మిల అరెస్ట్ అప్రజాస్వామికం'


మాట్లాడుతున్న గోవింద్‌నాయక్

కెరమెరి(ఆసిఫాబాద్): వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల అరెస్ట్ అప్రజాస్వామికమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు భుక్యా గోవింద్‌నాయక్ అన్నారు. లింగాపూర్ మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాదయాత్ర నిర్వహిస్తున్న షర్మిలపై బీఆర్‌ఎస్ నాయకులు దాడికి దిగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పాదయాత్ర ఆగదని స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలను బయటపెడతారనే భయంతోనే అరెస్టులకు దిగుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఆనందీశ్వర్, జాదవ్‌లాల్ సింగ్, బానోత్ గోవింద్‌నాయక్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.